క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

మిర్యాలగూడ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీనునాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి భారీగా నిధులు పెంచినట్లు అంకెల గారడీ చేసి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల ముందు గొప్పగా ప్రకటించిన కేంద్రం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకుండా సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్‌లో విలీనం చేశామని చెప్పడం తగదన్నారు. ఇప్పటికైనా కేంద్రం బడ్జెట్‌ను సవరించి గిరిజనులకు పెద్దపీట వేయాలని కోరారు.

తెలంగాణకు మొండిచేయి

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించిందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాగుల సైదులు అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ ఎంపీలు ఉన్నప్పటికీ ఈ అన్యాయాలపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్రం తెలంగాణపై చిన్న చూపు చూడటం సరికాదన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు వద్దబోయిన సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ కార్మికుల బదిలీ

మిర్యాలగూడ : మిర్యాలగూడ శివారులో గల ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న 186 మంది కార్మికులను హైదరాబాద్‌లోని చర్లపల్లి ఎఫ్‌సీఐకి బదిలీ చేస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. వారి స్థానంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కార్మికులను నియమించనున్నట్లు సమాచారం. కాగా, బదీలలపై తమకు అధికారికంగా ఉత్తర్వులు రాలేదని సంబధిత అధికారులు తెలిపారు. గతంలో సైతం ఇదే విధంగా బదిలీలు చేసినట్లు హమాలీలు తెలిపారు.

శాకంబరిదేవిగా సరస్వతీ దేవి



మిర్యాలగూడ అర్బన్: మండలంలోని అవంతీపురంలో గల సరస్వతీ అమ్మవారు బుధవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో రాధాకృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ త్రిపురనేని శరత్‌బాబు, రామకోటేశ్వర్‌రావు, సత్యనారాయణ, జయశంకర్, రాంప్రసాద్, రామ్మూర్తి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సరోజ

పెద్దవూర: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను బుధవారం తహసీల్దార్ ఎస్.సరోజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫొటోలు తీయడం ఒక కళ అని, సృజనాత్మకతతో కూడినదని అని అన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బొడ్డు వెంకట్, నాయకులు శ్రీను, రామాంజి, రాజు, అంజి, నాగేశ్వర్‌రావు, శ్యామల వర్మ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

హాలియా : భూమి పట్టా ఉన్న రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని హాలియా వ్యవసాయ అధికారి సరిత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 28, 2024లోపు భూమి పట్టా కలిగి ఉండి 18 నుంచి 59 ఏళ్ల వరకు ప్రతి రైతు ప్రభుత్వం అందించే రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు. రైతు బీమాలో తప్పుల సవరణకు నామినీ మరణించినా, పేరు మార్పు, ఇతర సవరణలకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు స్థానిక ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

కొండమల్లేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడకు 70 ఆవుదూడలను తరలిస్తున్న డీసీఎంను బుధవారం కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఆవుదూడలను చండూరులోని యుగ తులసీ గోశాలకు తరలించి, కేసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

మొక్కల పండుగకు సిద్ధం

- ఆగస్టు 1నుంచి వన మహోత్సవం
- మిర్యాలగూడ నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యం
- అన్ని మొక్కలకు జియోట్యాగింగ్



మిర్యాలగూడ మండలం ఆలగడప నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషగిరి శర్మ, తదితరులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందుకు అనుగుణంగా అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారులు, ప్రభుత్వ సంస్థలు, రైస్‌మిల్లులు, ఖాళీ స్థలాలు, మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే మొక్కలను సిద్ధం చేసే పనిలో అధికారులు ఉన్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దారు హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌లతో కలిసి స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వనమహోత్సవంపై సమీక్ష నిర్వహించి ఆగస్టు 1నుంచి మొక్కలు నాటాలని నిర్ణయించారు.

మొదట ఇంటింటికీ పంపిణీ..

వనమహోత్సవంలో భాగంగా మొదటి దశలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేయనున్నారు. ప్రధానంగా ఇళ్లు, ఆపార్ట్‌మెంట్లు, పాఠశాలలు, ఆలయాలు, ప్రార్థనాలయాల్లో మొక్కలను నాటేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. వర్షాలు కురిసిన తర్వాత రహదారుల పక్కన గుంతలు తవ్వి ఇతర మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాళీ ప్రదేశాలు కూడా తక్కువగా ఉన్నందున మొక్కలను పెంచే ప్రయత్నంలో కాలనీ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను భాగస్వాములను చేయనున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి..

నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో నాటాల్సి ఉన్నందున మొక్కలు సరిపోవని అధికారులు భావిస్తున్నారు. దీంతో మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. కొంత కాలంగా నియోజకవర్గంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల స్థలాలు, శ్మశాన వాటికలు, చెరువుల వద్ద మొక్కలను పెంచేందుకు అధికారులు దృష్టి సారించనున్నారు. నియోజకవర్గంలో నాటిన ప్రతి మొక్కను జియోట్యాగ్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొక్కలు నాటిన తరువాత జియోట్యాగ్ చేయనున్నారు. ప్రతి మొక్క వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచనున్నారు.

మొక్కలకు జియోట్యాగ్



వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా ఇంటింటికీ ఇచ్చే మొక్కలు తెప్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. మొక్కలను స్వచ్ఛంద సంస్థల ద్వారా తీసుకవచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగ్ చేస్తాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

నీటి తరలింపు రైతాంగాన్ని వంచించడమే

- రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు



సాగర్ కాలువపై నిరసన తెలుపుతున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్: తాగునీటి నెపంతో నాగార్జునసాగర్ నీటిని ఖమ్మం జిల్లాకు తరలించడం నల్లగొండ రైతాంగాన్ని వంచించడమే అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సాగర్ కాలువను పరిశీలించిన తర్వాత మూసి ఉన్న తూముల వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే తూములు మూసివేసి, అధికారులను కాపలాగా పెట్టి నీటిని తరలించడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తూములను తెరిచి నీటిని వదలాలని డిమాండ్ చేశారు. సాగర్ నీటితో చెరువులను నింపాలని కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్‌చేసి నీటిని తరలించుకు పోతున్నాడని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు వల్లంపట్ల వెంకన్న తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని యాద్గార్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రావూరి బాలు, ప్రధానోపాధ్యాయుడు రూప్‌సింగ్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు నాగవెల్లి ఉపేందర్, అనూజ, గీత, హరణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రేణుక, వెంకట్‌రెడ్డి, గులాం అహ్మద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



దేవరకొండలో సభ్యత్వాలు ఇస్తున్న నాయకులు

పెద్దవూర: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సెమీరెసిడెన్స్ విధానాన్ని స్వాగతిస్తున్నామన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి మూడో తరగతి వరకు కలపాలి అనే అంశాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వడ్త్య రాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్‌మియా, కృష్ణ, సహదేవి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, చైతన్య పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

దేవరకొండ: పీఆర్టీయూ–టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత ,బాలుర పాఠశాలల్లో ఆ సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు కొర్ర లోక్యానాయక్, దామోదర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, చేరుపల్లి శ్రీనివాస్, మాత్యనాయక్, సామ్యానాయక్, రెబకా, చందర్‌నాయక్, వాసికర్ల రమేష్, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదు



మిర్యాలగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

మిర్యాలగూడ టౌన్ : ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదని వికలాంగ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి అహ్మద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొలగాని వెంకటేష్ గౌడ్ అన్నారు. మిర్యాలగూడ దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 చట్టం 92 ప్రకారం స్మీతా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంటనే దివ్యాంగులకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఫెడరేషన్ నాయకులు దైద శ్రీకాంత్, తాళ్లపల్లి సురేష్, రాచూరి సైదులు, గగులోతు మదన్, అలి, ఏంఏ సలీం, లక్ష్మీనారాయణ, పద్మ, సింగు రాంబాబు, భారతమ్మ, అయేషా, నసిరుద్దీన్ బాబా, సత్యనారాయణ, హరిబాబు, జానీ, నాగరాజు తదితరులున్నారు.

స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు



చింతపల్లి : ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

చింతపల్లి : వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం దివ్యాంగులు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్ల నర్సింహగౌడ్ మాట్లాడుతూ వివక్షతకు గురవుతున్న వికలాంగులను ఆమె మాటలు మరింత బాధకు గురి చేశాయని అన్నారు. ఐఏఎస్ అధికారి అయి ఉండి అంగవైకల్యం ఉన్న వారు ఉన్నత ఉద్యోగాలకు పనికి రారంటూ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, దివ్యాంగులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీమల వెంకటేష్, ధర్మానాయక్, జమ్లా నాయక్, తదితరులున్నారు.

హామీల అమలులో పాలకులు విఫలం



మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

వేములపల్లి : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల నిర్మాణ మహాసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను నిరాశ పరిచిందన్నారు. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో అనేక మంది ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. జిల్లా మంత్రి స్పందించి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు అందించాలన్నారు. డివిజన్ ఆసుపత్రిలోనే సదరం సర్టిఫికెట్లు అందించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి బిల్ల యాదగిరి, వల్లంపట్ల వెంకన్న, పుట్టల రాములు, కృష్ణ, వెంకన్న, యశ్వంత్, ధనమ్మ, సైదమ్మ, ఆనందం, వెంకటయ్య, సత్యం, ఏసు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పట్టించుకోని కేంద్రం



మాట్లాడుతున్న నూనె వెంకటేశ్వర్లు

డిండి: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు లింగమయ్య, విద్యాసాగర్, బూషిపాక సాయిలు, వెంకటయ్య, నరసింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్

వేములపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు నిరాశ కలిగించిందని రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రాంరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం స్వామినాథన్ సిఫారసులను పక్కకు పెట్టిందని ఆరోపించారు. ఆరుగాలం పండించిన పంటలకు సరైన మద్దతు ధర కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కార్పొరేట్లకు కొమ్ము కాసేలా ఉందన్నారు. అదేవిధంగా బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యత కల్పించకుండా మరోసారి మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి నిధులు తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాఘవరావు

త్రిపురారం : గ్రామ పంచాయతీల నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని డీపీఎల్ఓ రాఘవరావు హెచ్చరించారు. మండలంలోని దుగ్గెపల్లి, కంపాసాగర్ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం డీపీఎల్ఓ రాఘవరావు ఆయా పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఇంచార్జి ఎంపీఓ రాజేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ తీసుకోవడం నేరం



మాట్లాడుతున్న సీఐ ధనుంజయ్య

కొండమల్లేపల్లి : డ్రగ్స్ తీసుకోవడం చట్టరీత్యా నేరమని సీఐ ధనుంజయ్య అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మటిల్డా స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీఓ బొడ్డుపల్లి శ్రీనివాస్‌లు కోరారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని మండల మహిళా సమాఖ్య భవన్ ఆవరణలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఆయా గ్రామాల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు



హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

కొండమల్లేపల్లి : శుభకార్యాలు, ఫంక్షన్ హాళ్లలో డబ్బుల కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని ఎస్ఐ రామ్మూర్తి అన్నారు. కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డబ్బులు వసూళ్ల విషయంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, ఇబ్బందులు పెట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ: దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో గల మోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పట్టణంలోని రోడ్డు డివైడర్ల మధ్య గల మోనోకార్పస్ చెట్ల వల్ల శ్వాసకోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో చొల్లేటి భాస్కరాచారి, అంకం చంద్రమౌళి, గాజుల మురళి, రాసమళ నాగయ్య, కృష్ణాచారి, జయలక్ష్మి, మునిని సత్యం తదితరులున్నారు.

డొంకదారిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

వేములపల్లి : మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామ శివారులో డొంకదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉన్న డొంకదారి గుండా రైతులు తమ పంట పొలాలకు వెళ్లి సాగు చేసుకునేవారమని తెలిపారు. కొందరు రైతులు ఆ దారిని ఆక్రమించుకోవడంతో ఆ మార్గం గుండా వెళ్లలేకపోతున్నామని వాపోయారు. కార్యక్రమంలో మాచనబోయిన కన్నయ్య, సైదులు, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దుకాణదారుడిపై కేసు

మిర్యాలగూడ అర్బన్: మైనర్‌ను పనిలో పెట్టుకున్న దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బి.శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. బాలలను పనిలో పెట్టకుండా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. బాల బాలికలను పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 15 కేసులు నమోదు అయ్యాయని, మరిన్ని దాడులు నిర్వహించి బాలకార్మికులకు విముక్తి కల్పిస్తామని తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు

- అమ్మ ఆదర్శ పథకం కింద రూ.కోటి 3లక్షలు విడుదల
- గుర్రంపోడు మండలంలో 30 పాఠశాలల్లో చురుగ్గా పనులు
- తరగతి గదుల్లో కరెంట్ సౌకర్యం



తేనెపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లాలు

గుర్రంపోడు : అమ్మ ఆదర్శ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాఠశాలల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు, మంచినీటి వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏటా అరకొరగా అందే స్కూల్ గ్రాంటు నిధులు పాఠశాల నిర్వహణకే సరిపోక అసౌకర్యాల మధ్యనే వాటిని వినియోగించేవారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం అమ్మ ఆదర్శ పథకం ద్వారా అవసరమైన పాఠశాలలను గుర్తించి నిధులు మంజూరు చేసింది. మండలంలో 30 పాఠశాలలకు రూ.1.3కోట్లు మంజూరు కాగా పనులు చివరిదశలో ఉన్నాయి. ఇప్పటికే కోయగూరవారిబావి, ఆరెగూడెం, వెంకటాపురం(కె) పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

అమ్మ ఆదర్శ కమిటీలతో పక్కాగా..

ప్రభుత్వం ఇటీవల సంఘబంధం గ్రామ విలేజ్ ఆర్గనైజర్‌లను పాఠశాలలకు చైర్‌పర్సన్లుగా నియమించింది. పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా ఉండి జాయింట్ ఖాతాలో ముందుగానే పాఠశాలలకు అడ్వాన్సుగా నిధులు జమచేయడంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులతోపాటు పాఠశాల పైకప్పుపై ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి కింద సంపు, ఇన్‌వెల్ మోటారు, టైల్స్‌తో నీటి కులాయిల సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అన్ని గదుల్లో కరెంటు సౌకర్యం, ట్యూబ్‌లైట్లు, కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీడీఓ, ఏఈల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

అసంపూర్తిగా మన ఊరు– మన బడి పనులు

గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం మన ఊరు మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులు చాలా పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని పనులు పూర్తికాగా చేసిన పనులకు కొన్ని చోట్ల బిల్లులు అందలేదు. ప్రస్తుతానికి మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులకు సంబంధించి ఏలాంటి నిర్ణయం జరగక పోవడంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అమ్మ ఆదర్శ పనులు పూర్తయిన తర్వాత వీటిపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

సంఘబంధాలు బలోపేతం



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు రెండు జతల యూనిఫాం కుట్టించే బాధ్యత అప్పగించడం వల్ల మహిళా సంఘాలకు ఉపాధి లభిస్తుంది. తద్వారా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయి.

– తరి ఉమారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

పక్షం రోజుల్లో పనులన్నీ పూర్తి



అమ్మ ఆదర్శ పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా హెచ్ఎంలు, వీఓలు సమన్వయంతో పనిచేస్తున్నారు. బిల్లులు త్వరితగతిన చెల్లిస్తున్నాం. మరో పక్షం రోజుల్లో పనులన్నింటినీ పూర్తి చేయిస్తాం.

– తరి రాము, మండల విద్యాధికారి